క్లుప్తంగా

ఫైర్ ఆఫీసర్‌గా వెంకట సుబ్బయ్య


బాధ్యతలు చేపడుతున్న వెంకట సుబ్బయ్య

వేంపల్లె : వేంపల్లె అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఆఫీసర్‌గా వెంకట సుబ్బయ్య గురువారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా లీడింగ్ ఫైర్ అధికారి హరిబాబు, జగన్నాథరెడ్డి, ఉత్తమారెడ్డి, భీమాంజనేయులు, డ్రైవర్ శివకుమార్‌లు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అనేక అగ్ని ప్రమాదాలు నివారించడం, మూగజీవాలు రక్షించడం, ప్రజలను రక్షించడం, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడం లాంటివి చేశామన్నారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేశామని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు


భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ

వేంపల్లె : భవన నిర్మాణ కార్మిక సంఘం వేంపల్లె నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి లింగన్న ఆధ్వర్యంలో గురువారం స్థానిక జీటీ ఫంక్షన్ హాల్‌లో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడు ఎస్.దస్తగిరి, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జమాల్ బాషా, కోశాధికారి రమేష్‌బాబు, బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఆంజనేయులు, దేవరాజు, నాగమల్లయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సంఘం బలోపేతానికి కృషి చేద్దామని, అలాగే ప్రభుత్వ పరంగా రావాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. అంతేకాకుండా ఇతరత్రా సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు.

ఘన సన్మానం


రాంగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్మికులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చౌటపల్లి రాంగోపాల్‌రెడ్డిని కాంట్రాక్టు కార్మికులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో డాక్టరు ఎన్‌టీటీపీలో 13 మంది కాంట్రాక్ట్ కార్మికులను తీసుకుని నాలుగేళ్లు పని చేయించుకుని 2020 జూలై నెలలో తొలగించారన్నారు. తర్వాత ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాంగోపాల్‌రెడ్డి ఈ సమస్యలను రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. దీంతో ఏపీజెన్‌కో ఎండీ ఆ కార్మికులను విధులలోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చారన్నారు. దీంతో కార్మికులందరూ కలసి రాంగోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


ఐజయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగెళ్ల సాంబశివారెడ్డి

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం ఐజయ్య (72) గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని ఐజయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 మెయిన్స్‌కు అదనపు సమయం ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత అదనపు సమయం ఇవ్వాలని కోరుతున్నామని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాగే సిలబస్ ఎక్కువగా ఉన్నదని, ఈ రెండు కారణాల దృష్ట్యా గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి కాకుండా, మరో 2 నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు.

ఈ స్టేషన్‌కు ఎస్‌ఐ కావలెను..!

- ఖాళీగా ఉన్న కలమల్ల ఎస్‌ఐ పోస్టు
- అనుకూల అధికారి కోసం నేతల యత్నాలు
- ఈ స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ గ్రామాలు
- అసాంఘిక కార్యకలాపాలపై కొరవడిన నిఘా



ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల పోలీస్ స్టేషన్‌లో గత 12 రోజులుగా ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు భర్తీ ఎప్పటికి జరుగునో అని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. అధికార పార్టీ నాయకులు వారికి అనుకూలంగా ఉండే వారినే నియమించుకోవాలని ప్రజాప్రతినిధుల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ సంజీవరెడ్డిని సార్వత్రిక ఎన్నికల తర్వాత వీఆర్‌కు పంపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పోస్టు భర్తీకి నోచుకోలేదు. ఈ స్టేషన్ పరిధిలో కలమల్ల, మాలెపాడు, చిన్నదండ్లూరు, ఇల్లూరు, సున్నపురాళ్లపల్లి, ఆర్టీపీపీ గ్రామ పంచాయతీలు వస్తాయి. ఇందులో చిన్నదండ్లూరు, ఇల్లూరుకు ఫ్యాక్షన్ గ్రామాల గుర్తింపు ఉంది. ఈ గ్రామాలలో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ గ్రామాలపై ప్రత్యేక నిఘా కోసం నాక బందీలు నిర్వహించి పికిటింగ్‌లు కూడా నిర్వహిస్తుంటారు. ఇక ఆర్టీపీపీలో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తుంటారు. ఈ ఆర్టీపీపీలో దొంగల భయం కూడా అధికంగా ఉంటుంది. గత ఐదేళ్ల కిందట చూస్తే ఆర్టీపీపీలో దొంగతనాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. అప్పట్లో ఏక కాలంలోనే కొన్ని ఇళ్లలో దొంగలు పడి విలువైన ఆభరణాలు దొంగలించిన ఘటనలు పోలీస్ రికార్డులలో ఉన్నాయి. ఇక్కడ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో కొంత మంది పోలీస్ సిబ్బంది ఇదే అదునుగా వ్యవహరిస్తూ.. పంచాయితీలు బయటనే నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. చోటా నాయకులైతే ఏకంగా సిబ్బందితో కలిసి ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం. ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో కొందరు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, పేకాట, బెట్టింగ్‌లపై నిఘా తగ్గినట్లు తెలుస్తోంది. ఉద్యోగులు, కార్మికులు అధికంగా ఉండటంతో ప్రొద్దుటూరు ప్రాంతం నుంచి జూదరులు ఇక్కడికి వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా పోలీసులు దాడులు చేసినప్పుడు ప్లాంట్‌లో పని చేస్తున్న వారితోపాటు ప్రొద్దుటూరుకు చెందిన వారే దొరికారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పులిరామ్‌సింగ్

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో అతిసార వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎమ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడి చనిపోకుడదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఓఆర్‌యస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు ప్రతి ఇంటికి పంపిణీ చేయడంతోపాటు వాటిని వాడే విధానం గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రతి గ్రామంలోని విలేజ్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రంలో ఓఆర్‌యస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడంతోపాటు పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రత పట్ల పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు వంట చేయు ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీహెచ్‌ఓలు ప్రతి గ్రామంలో తాగునీటి నమూనాలను సేకరించి వాటిని వాటర్ క్వాలిటీ చెక్ చేయాలని, అంతే కాకుండా ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో కూడా పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. ఎంపీడీఓ పులిరామ్ సింగ్ మాట్లాడుతూ తాగు నీరు కలుషితం కావడం వల్ల డయేరియా బారిన పడే ఆవకాశం ఉందని, కనుక తాగునీరు కలుషితం కాకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటిని సరైన పద్ధతిలో క్లోరినేషన్ చేయాలని చెప్పారు. సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పైపులైన్లు తనిఖీ చేయాలని, లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. గ్రా సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది భాగస్వామ్యంతో వ్యక్తిగత పరిశుభ్రతపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూస్ శాఖలు పూర్తి సమన్వయంతో పని చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

పరిశోధకుడికి డాక్టరేట్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం పరిశోధకుడు సి. ప్రవీణ్‌కుమార్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర ఆచార్యులు డా. జి. పార్వతి పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ డీ సెంట్రలైజేషన్ ఆన్ సర్వీస్ డెలివరీ సిస్టం ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ విలేజ్ సెక్రటేరియట్ ఇన్ కర్నూలు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను ఈయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

డీఏపీ మంజూరు


లారీ నుంచి డీఏపీని దించుతున్న దృశ్యం

చెన్నూరు : మండలంలోని రామనపల్లె రైతు భరోసా కేంద్రానికి ఖరీఫ్–2024 సీజన్‌కు 400 బస్తాలు సబ్సిడీపై రైతులకు డీఏపీ మంజూరైనట్లు గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులు యు సునీల్ అన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ వద్ద ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ తీసుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు తమకు సంబంధించిన పంటలను రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నదని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

చక్కని పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి


నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల డీన్ మణి

పులివెందుల టౌన్ : విద్యార్థులు చక్కని పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని బెంగళూరు గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ డీజీఎం చంద్రమోహన్, తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ల జీఎం కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో కాలేజ్ అండ్ హాస్టల్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ మణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల ఆహార విజ్ఞానశాస్త్రం కళాశాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఆహార ప్రాసెసింగ్ సెక్టార్‌లో అనేక అవకాశాలున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్, వార్డెన్ డాక్టర్ కీర్తిరెడ్డి, అరుణ, రాజేష్, జయమ్మ, నివేదిత, సాయి శ్రీనివాస్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అమలా ఆరోఖ్య రాజ్, ఇతర కళాశాలల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

29 నుంచి మహాయాగం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆధ్యాత్మ విద్యా ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో దశకోటి కృష్ణ మంత్ర మహాయాగం, శ్రీ సరస్వతి మహాయాగం నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి పండిత డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. గురువారం కడప బ్రాహ్మణ వీధిలోని శ్రీ జూల్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఇతర ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సత్యభామ రుక్మిణి సమేత కృష్ణ పరమాత్ముడి వివాహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు దశకోటి కృష్ణ మంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆనంద తీర్థ, గుండూరావు, విజయసింహా, శ్యామసుందర్, కొసూరుగోపి, కట్టి రంగవిఠల్‌రావు, భానుజీరావు, మురళి, అరుణాదేవి, వేదవతి, ప్రభ పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి


హాస్టల్ వార్డెన్ బ్రహ్మంతో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు బీసీ సంక్షేమ హాస్టల్‌లను గురువారం సందర్శించి విద్యార్థులను, వార్డెన్‌లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాత్రూంల డోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కిటికీలు దెబ్బతినడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని మోడంపల్లె సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహ వార్డెన్ బ్రహ్మం మాట్లాడారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డు రాజేశ్వరి కాలనీలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో వార్డెను సురేష్‌బాబును అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘనాయకులు మాట్లాడుతూ హాస్టల్ బిల్లులు నెలల తరబడి మంజూరు కాకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హాస్టల్‌లను పరిశీలించిన వారిలో జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళీ, ఉపాధ్యక్షుడు ప్రతాప్, సత్యసాయి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

29, 30న సాయిబాబా మందిరంలో రజతోత్సవాలు

కడప అర్బన్ : కడప నగరంలోని నబీకోటలో వున్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 29, 30 తేదీలలో శ్రీ షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ రజత మహోత్సవాలను నిర్వహించనున్నారు. 29న ఉదయం 8 గంటలకు గణపతిపూజ, గంగపూజ, సాయంత్రం 5 గంటలకు కలశ స్థాపనం, వాస్తు శాంతి, మహా మంగళ హారతి నిర్వహిస్తారు. 30న ఉదయం 7 గంటలకు ప్రాతః కాల మహోత్సవ పూజలు, హోమం, మధ్యాహ్నం అన్న ప్రసాదం అందచేస్తారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలలో భక్తాదులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ధర్మకర్త గోదెన కృష్ణమూర్తి, ప్రమీలమ్మ విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. సీఆర్టీలకు మినిమల్ టైమ్ స్కేలు వర్తింపు విషయంలోనూ, క్రమబద్ధీకరించడంలోనూ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. పనితీరు సూచికలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఆధారంగా సర్వీసును రెన్యువల్ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వార్డెన్ పోస్టులు, నైట్ వాచ్‌మెన్ పోస్టును మంజూరు చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తించే అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలన్నారు. కేజీబీవీ సిబ్బంది సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.శివారెడ్డి, జిల్లా కౌన్సిలర్ కె.విజయభాస్కర్‌రెడ్డి, మహిళా కార్యదర్శి బేబీసరోజ, స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య, నారాయణ, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ కోరారు. గురువారం ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్‌కు ఎస్ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలను అమ్ముతూ అక్రమంగా వేల రూపాయలు వసూలు చేస్తు న్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్‌ఐ నాయకులు మనోజ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్‌బ్యాంక్‌లో నగదు లేక ఇక్కట్లు

- వెనుదిరిగిన ఖాతాదారులు



కొండాపురంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కొండాపురం : మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్‌లో నగదు లేక గురువారం ఖాతాదారులు వెనుదిరిగారు. మారుముల గ్రామాల నుంచి వచ్చామని, చాలా సేపు క్యూలైన్‌లో వేచి ఉన్నా చివరికి నగదు అందలేదని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్‌లో ఎవరైనా నగదు కట్టితే.. ఇస్తామని సిబ్బంది చెప్పడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ బ్యాంక్‌లో వ్యవసాయ, బంగారు రుణాలకు సంబంధించిన వారు, డిపాజిట్ ఖాతాదారులు వేల సంఖ్యలో ఉన్నారు. రోజూ ఎక్కువ లావాదేవీలు జరుగుతున్నా బ్యాంక్‌లో నగదు అందుబాటులో పెట్టాల్సిన బ్యాంకర్ల నిర్లక్ష్యానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఏటీఎం కేంద్రంలో ఎప్పుడూ నగదు ఉంచకపోవడంతో.. దానివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఎక్కడా నగదు లేక పోవడంతో గ్రామాలు, మండల కేంద్రంలోని బీసీ సెంటర్ల వద్ద రూ.10 వేల వరకే తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. అలాగే ఆధార్‌కార్డు లింక్ కోసం బ్యాంక్‌కి వెళ్లితే పత్రాలు తీసుకొని చేస్తాం పో అని సమాధానం చెబుతున్నారు. వారం తర్వాత బీసీ సెంటర్ల వద్దకే వెళ్లితే ఆధార్ లింక్ కాలేదని వారు చెబుతుండటంతో.. ఎన్ని సార్లు బ్యాంక్‌కు వెళ్లాల్సి వస్తుందని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఏటీఎంలో నగదు ఉండేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు. నగదు, ఆధార్ లింక్ విషయంలో బ్యాంక్ చుట్టూ తిప్పుకోకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యలపై బ్యాంక్ ఉన్నతాధికారులు చొరవ చూపి పరిష్కారం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై బ్యాంక్ మేనేజర్ రమేష్‌ను వివరణ కోరగా.. ఉన్న నగదు ఇచ్చామని, రేపు తెప్పిస్తామన్నారు.

సాగు సాయం రూ.20 వేలు అందించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

కమలాపురం : రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీటీ అహల్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20 వేలు ఈ సీజన్‌లో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తి, ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు ఇవ్వాలన్నారు. అలాగే పావలా వడ్డీతో రూ.5 లక్షల వరకు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి వారికి రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, పనిముట్లు 50 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీతో డీజిల్ అందించాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టి, కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు షేక్షావలి, మిద్దె రమణ, సుబ్బరాయుడు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థికి హోమియో మందు తినిపిస్తున్న వైద్యుడు షాకీర్ హుసేన్

కమలాపురం : వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్ హుసేన్ తెలిపారు. స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 345 విద్యార్థులను పరీక్షించి వారికి డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా హోమియో మందులు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాధులకు హోమియోలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. అలాగే ఈ మందులు వినియోగిస్తే సైడ్ ఎఫెక్ట్స్ రావన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, చికున్ గున్యా తదితర వ్యాధులకు సైతం హోమియోలో అద్భుత మందులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కమలాపురంలోని హోమియో వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రాఘవ, వైద్య సిబ్బంది హరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు'లో అధిక ఫీజులు నియంత్రించాలి

జమ్మలమడుగు : ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు పిల్లల తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అటువంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ నాయకుడు వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులంటూ భారీగా డబ్బులు వసూలు చేయడంతోపాటు పాఠశాలల్లోనే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఎక్కువ ధరలకు అమ్ముకుంటూ వ్యాపారం కొనసాగించడం జరుగుతోందన్నారు. పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద 25 శాతం నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉందని, అయితే ఈ చట్టం సరిగా అమలు చేయడం లేదన్నారు. విద్యాశాఖాధికారులకు ఇందతా తెలిసినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అధిక ఫీజుల బారి నుంచి పిల్లల తల్లిదండ్రులను కాపాడాలని కోరారు.

భవిత చిన్నారులకు దుప్పట్ల పంపిణీ


చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నజీమ్ అహమ్మద్

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని భవిత దివ్యాంగుల కేంద్రంలో ఉన్న చిన్నారులకు కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి వారు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి భవిత దివ్యాంగుల విద్యావనరుల కేంద్రం చిన్నారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి సెక్రటరీ నజీమ్ అహమ్మద్, భవిత దివ్యాంగుల కేంద్రం ఐఈఆర్టీలు యశోద, సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : ఎమ్మార్పీఎస్ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా బాలయ్య మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ గురువారం తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఛలో వరంగల్ వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని మాదిగలంతా విజయవంతం చేయాలని వెంకటేష్ కోరారు. అలాగే ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడిగా చాపాటి నాగరాజు మాదిగ, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడిగా సగబాల ఓబులేసు మాదిగ, రాజుపాళెం మండల అధ్యక్షుడిగా ఓబుళపతిగాళ్ల రామకృష్ణ మాదిగ, రాజుపాళెం మండల ఉపాధ్యక్షులుగా చింతల చంద్ర మాదిగను యాడికి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఓబయ్య మాదిగ, బీసీ నాయకులు వెంకట ప్రసాద్, మనోజ్, రవి పాల్గొన్నారు.

మాదిగ జనజాతరను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రకాశం జిల్లాలోని ఈదుముడి గ్రామంలో జులై 7న నిర్వహించే మాదిగ జన జాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ కోసం ఉద్యమం ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజంలోని అన్ని పీడిత వర్గాలకు అండగా నిలిచిందన్నారు. మాదిగలు బహిరంగ సభలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎం రాజా, నాయకులు నరసింహులు, ఎల్లయ్య, పుల్లయ్య, శ్రీనివాస్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.